

సాగు సంకటం..!

కర్నూలు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):
తుంగభద్ర డ్యాం 19వ గేటు చైన్ లింక్ తెగిపోవడంతో నీరంతా కడలిపాలవుతోంది. ఫలితంగా పంటలకు సాగునీరందించడం కష్టతరంగా మారుతోంది. దీంతో ఎల్లెల్సీ, కేసీ కెనాల్ ఆయకట్టు రైతుల్లో ఆందోళన మొదలైంది. దీనికితోడు గేటు మరమ్మతుల కోసం డ్యామ్‌లోని నీటిని వదిలేస్తుండడంతో నదీతీర గ్రామాల ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఏ క్షణంలో వరద ముంచెత్తుతుందోనన్న ఆందోళనలో ఉన్నారు.



కౌతాళం మండలం వల్లూరు వద్ద ప్రవహిస్తున్న తుంగభద్ర నది

- తుంగభద్ర డ్యాం 19వ గేటు ప్రభావం
- డ్యాంను ఖాళీ చేస్తున్న బోర్డు అధికారులు
- 65 టీఎంసీల నీరు కడలిపాలు
- వరద వస్తేనే ఖరీఫ్‌కు సాగు నీరు



తుంగభద్ర జలాశయం ఆలూరు, ఆదోని, మంత్రాయలం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల ప్రజల జలజీవనాడి. టీబీపీ డ్యాంకు అనుసంధానంగా నిర్మించిన తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) కింద ఆలూరు, ఆదోని, కౌతాళం, కోసిగి, పెద్దకడుబూరు, మంత్రాలయం, నందవరం, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, సి.బెళగల్, కోడుమూరు మండలాల్లో ఖరీఫ్‌లో 43,514 ఎకరాలు, రబీలో 1.15 లక్షల ఎకరాలు ఆయకట్టుకు సాగు నీరు అందాల్సి ఉంది. 196 గ్రామాలకు తాగునీరు అందించాలి. 24 టీఎంసీల నీటి వాటా ఉంది. ఈ ఏడాది ముందుగా డ్యాం పూర్తి స్థాయి సామర్థ్యం 105.788 టీఎంసీలకు చేరడమే కాకుండా భారీగా వరద ఉండడంతో గేట్లెత్తి దిగువ నదికి నీరు విడుదల చేశారు. జూలై మొదటి వారంతో వరద మొదలై ఇప్పటికే 265 టీఎంసీలు డ్యాంకు చేరినట్లు అంచనా. 135 టీఎంసీలు దిగువకు వదిలారు. 35 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని ఐఏబీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దీనికి తోడు ఆశాజనకంగా వరద చేరుతుండడంతో ఖరీఫ్, రబీకి సాగునీటి ఇబ్బందులు ఉండవని రైతులు ఆనందించారు. ఆ సంతోషం అంతలోనే ఆవిరైంది. ఎత్తిన గేటు దించుతుండగా చైన్‌లింక్ తెగిపోయి 19వ గేటు కొట్టుకుపోయింది. మరమ్మతులు చేయాలంటే డ్యాం ఖాళీ చేయక తప్పదు. 65 టీఎంసీలు కళ్లముందే కడలిపాలవుతుంటే కష్టజీవులు కన్నీళ్లు పెడుతున్నారు. ఖరీఫ్ సాగుకైనా నీళ్లు వస్తాయా..? అంటూ ఆందోళన చెందుతున్నారు. అదే క్రమంలో కేసీ కాలువ కింద ఈ ఏడాది 1,78,388 ఎకరాలకు నీళ్లు ఇస్తామని ఐఏబీలో తీర్మానం చేశారు. కేసీ కాల్వకు టీబీ డ్యాం నుంచి 10 టీఎంసీలు అందాల్సి ఉంది. తాజా పరిస్థితులతో తుంగభద్ర డ్యాం రావాల్సిన వాటా అందుతుందా..? అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఎల్లెల్సీ, కేసీ కాల్వల కింద 2.10 లక్షల ఎకరాల సాగుకు రైతులు సిద్ధం అవుతున్నారు. వరి నాట్లు కూడా వేస్తున్నారు. తుంగభద్ర గేటు కొట్టుకుపోవడం, స్టాప్‌లాక్ ఏర్పాటు చేస్తున్నా.. అది వరద ఉధృతికి తట్టుకుంటుందా..? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. దీంతో ఖరీఫ్ పంటలకు కూడా సాగు నీరు అందించడం కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నదీతీర గ్రామాలు అప్రమత్తం

కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యాం 19వ గేటు మరమ్మతుల్లో భాగంగా స్పిల్ వే లెవల్ 1613 అడుగుల వరకు డ్యాంను ఖాళీ చేస్తున్నారు. ఇందులో భాగంగానే డ్యాం నుంచి 99.567 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. అవసరాన్ని బట్టి మరింత పెంచే అవకాశాలు ఉన్నాయంటూ బోర్డు అధికారులు ఎప్పటికప్పుడు ప్రమాద హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కౌతాళం మండలం వల్లూరు వద్ద నది అంచులు దాటి ప్రవహిస్తోంది. కోసిగి మండలం సాతనూరు సమీపంలో ఆర్డీఎస్ ఆనకట్ట పరవళ్లు తొక్కుతోంది. మంత్రాలయం వద్ద 310.400 అడుగుల లెవల్‌లో 85 వేల క్యూసెక్కులు వరద ఉందని సీడబ్ల్యూసీ అధికారులు గుర్తించారు. నందవరం మండలం పెద్దకొత్తిలికి, జోహరాపురం, నాగులదిన్నె, గురుజాల, రాయచోటి గ్రామాల్లో నది అంచుల్లో వరద ప్రవాహం ఉంది. పెరిగితే ప్రమాదం ముంచుకొస్తుందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నది గరిష్ట ప్రవాహం 2 - 2.50 లక్షల క్యూసెక్కులని, ప్రస్తుతం లక్ష క్యూసెక్కులు కూడా లేదని, ప్రమాదం లేకపోయినా.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారు. కర్నూలు నగరంలో నదీతీర కాలనీవాసులు పలువురు ఆదివారం రాత్రి సురక్షిత ప్రాంతాలకు చేరుకోవడం కొసమెరుపు. ఇందుకు 2009 వరద సృష్టించిన బీభత్సమే కారణమని నగరవాసులు వాపోతున్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా మరమ్మతులు

తుంగభద్ర డ్యాం కొట్టుకుపోయిన 19వ గేటుకు తక్షణమే మరమ్మతులు చేసి రాయలసీమ రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని బోర్డు అధికారులను కోరాం. సీఎం చంద్రబాబు రాష్ట్రం నుంచి ప్రత్యేక బృందాన్ని పంపారు. గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు అక్కడే తిష్టవేసి మరమ్మతు పనులు పర్యవేక్షిస్తున్నాడు. టీబీ డ్యాం ఎండీ రాజేశ్ అమీన్‌తో ప్రత్యేకంగా భేటీ అయి తక్షణం మరమ్మతులు చేసి కర్నూలు సహా రాయలసీమ జిల్లాలకు సాగు, తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని కోరాం.
- బస్తిపాటి నాగరాజు, కర్నూలు ఎంపీ

గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్లే ఈ దుస్థితి

తుంగభద్ర డ్యాం నుంచి లక్షల క్యూసెక్కులు వరద వృథాగా సముద్రంపాలు అవుతుంటే బాధేస్తోంది. డ్యాం ఇంజనీర్లు, బోర్డు అధికారులతో మాట్లాడాం. గత వైసీపీ ప్రభుత్వంలో ఆనాటి సీఎం జగన్ మూడేళ్లుగా మరమ్మతులకు నిధులు ఇవ్వకపోవడం వల్లే ఈ రోజు 19వ గేటు చైన్‌లింక్ తెగిపోయి కొట్టుకుపోయింది. తక్షణమే మరమ్మతులు చేయాలని కోరాం.
- బి.వీరభద్రగౌడ్, ఆలూరు టీడీపీ నేత



నందవరం మండలం పెద్దకొత్తిలికి వద్ద నదిలో మునిగిపోతున్న మోటార్లను బయటకు తీసుకొచ్చే ప్రయత్నంలో రైతులు



కోసిగి మండలం ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద ఎన్‌డీఆర్ఎఫ్ దళాలు



ఆర్డీఎస్ ఆనకట్ట మీద ఉధృతంగ ప్రవహిస్తున్న వరద నీరు

డ్యాంను పరిశీలించిన ఎంపీ, టీడీపీ నేతలు

కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఆలూరు, మంత్రాలయం టీడీపీ ముఖ్య నాయకులు బి.వీరభద్రగౌడ్, ఎన్.రాఘవేంద్రరెడ్డిలు సోమవారం తుంగభద్ర డ్యాంను పరిశీలించారు. కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి, టీబీపీ ఎల్లెల్సీ డీఈఈలు హసీన్‌బాషా, అమర్నాథ్‌రెడ్డిలు ఉన్నారు. గేటు ఎలా కొట్టుకుపోయింది..? తీసుకుంటున్న మరమ్మతు చర్యలు వారికి వివరించారు. గేటు మరమ్మతు కోసం సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా పంపించిన ప్రాజెక్టు గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడుతో సమావేశమయ్యారు. కర్ణాటక మంత్రి శివరాజ్‌తో చర్చించారు.



పీజీఆర్ఎస్‌కు 115 ఫిర్యాదులు

- విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం
- ఎస్పీ జి. బిందు మాధవ్



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ జి. బిందు మాధవ్

కర్నూలు, ఆగస్టు 12: స్థానిక కొత్తపేట టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్పీ జి.బిందు మాధవ్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమం ముందుకు 115 సమస్యలు వచ్చాయి.

- ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన గిడ్డయ్య అనే వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానని రూ.1.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని, డబ్బులు అడిగితే ఇస్తానని చెప్పి- ప్రాంసరీ నోటు రాసి ఇచ్చి మోసం చేస్తున్నాడని కర్నూలు ప్రకాష్ నగర్‌కు చెందిన ప్రకాష్ ఫిర్యాదు చేశారు.
- తన కుమారుడు భువన్ కుమార్, కోడలు జ్యోతి తనను దుర్భాషలాడుతూ, వికలాంగుడైన తన తమ్ముడిని కొడుతూ అతని ఆస్తి కూడా తీసుకోవాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని కర్నూలు జనార్దన్ నగర్‌కు చెందిన లక్ష్మీదేవి ఫిర్యాదు చేశారు.
- తన భర్త బసవరాజు సంసారం పట్టించుకోకుండా తనను పుట్టింట్లో వదిలేశాడని తనకు న్యాయం చేయాలని సి. బెళగల్ మండలానికి చెందిన అరుణమ్మ ఫిర్యాదు చేశారు.
- కోడుమూరు-వెంకటగిరి రోడ్డులో ఉన్న మా స్థలాన్ని నాగభూషి లక్ష్మన్న ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నాడని కోడుమూరు వెంకటగిరి గ్రామానికి చెందిన బోయ లక్ష్మమ్మ, గిడ్డయ్య ఫిర్యాదు చేశారు.
- ఖమ్మం జిల్లా నివాసి, జాకీరుల్లాకి చెందిన ఆల్ బర్కత్ ఎలక్ట్రో మెకానికల్ కంపెనీలో పెట్టుబడులు పెట్టామని, అది ఒక బోగస్ సంస్థ కావడంతో మోసపోయానని, తనకు న్యాయం చేయాలని కర్నూలు గడ్డా వీధికి చెందిన మహ్మద్ ఆలీం ఫిర్యాదు చేశారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులు న్యాయం చేసి సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తానని ఎస్పీ జి. బిందుమాధవ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సీఐలు శివశంకర్, హాజీవలి పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించాలి

- కలెక్టర్ పి.రంజిత్ బాషా



అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 12: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన వినతులు రీ ఓపెన్ కాకుండా నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆన్‌లైన్ ద్వారా వచ్చిన వినతులను గంటకోసారి ఓపెన్ చేసి చూసి, పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్‌కు సంబంధించి 3, ఆర్‌డబ్ల్యూఎస్‌కు 3, సివిల్ సప్లయిస్ 3, సహకారశాఖకు 3, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్‌కు 3, కాలుష్య నియంత్రణ మండలికి 2, మున్సిపాలిటీ (లక్ష్మీపురం-2)కి 2, గిరిజన సంక్షేమ శాఖకు 2 దరఖాస్తులను ఇంత వరకు సంబంధిత శాఖల అధికారులు ఓపెన్ చేసి చూడలేదన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

జిల్లాలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో తిరంగ్ కాన్వాస్ మీద జిల్లా కలెక్టర్లు, ఇతర జిల్లా అధికారులు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో జిల్లా అధికారులందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం అధికారి విజయ, సెట్కూరు సీఈవో రమణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉల్లి ధర పైపైకి..

క్వింటం రూ.3,520

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 12: ఉల్లి ధర పైపైకి పోతోంది. సోమవారం కర్నూలు మార్కెట్ యార్డులో క్వింటం మధ్యస్థ ధర రూ.3,520 పలికింది. కనిష్ఠ ధర కూడా రూ.3,411కు చేరింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం క్వింటం ఉల్లి ధర రూ.500 కూడా లేకపోవడంతో రైతులు కన్నీరు మున్నీరయ్యారు. ప్రస్తుతం ఉల్లికి లభిస్తున్న ధరను బట్టి చూస్తే మరింత పెరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. వేరుశనగ కాయలు కూడా మంచి ధర పలుకుతుండటంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. గరిష్ఠ ధర రూ.7,319, మధ్యస్థ ధర రూ.7,110, కనిష్ఠ ధర రూ.3,700 పలికిందని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు, అదనపు సెక్రటరీలు వెంకటేశ్వర్లు రెహిమాన్ తెలిపారు. ఆముదాలకు కూడా మంచి ధర లభిస్తోంది. గరిష్ఠ ధర రూ.5,660, మధ్యస్థ, కనిష్ఠ ధర రూ.5,660 పలికాయి. కందులకు కాస్త ధర తగ్గింది. రెండు రోజుల క్రితం కర్నూలు మార్కెట్ యార్డులో క్వింటం కందులు రూ.10వేలకు పైగానే ధర రైతులకు దక్కింది. సోమవారం గరిష్ఠ, మధ్య, కనిష్ఠ ధర రూ.9,509కు తగ్గింది. శనగలకు గిట్టుబాటు ధర అందడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. శనగ గరిష్ఠ, కనిష్ఠ, మధ్యస్థ ధర రూ.6,909కు చేరింది.



శ్రీశైల జలాశయం గేట్లు మూసివేత

శ్రీశైలం, ఆగస్టు 12: శ్రీశైలం జలాశయం క్రస్టు గేట్లను డ్యాం అధికారులు సోమవారం సాయంత్రం మూసివేసి వేశారు. ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో జలాశయం గేట్లను మూసివేసినట్లు అధికారులు తెలిపారు. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి జూరాల జలాశయం నుంచి వరద ప్రవాహం నిలిచిపోయింది. సుంకేసుల నుంచి 77,598 క్యూసెక్కులు వరద ప్రవాహం వస్తోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 881.20 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 194.3096 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 30,671 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,540 క్యూసెక్కుల మొత్తం 68,211 క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.



ఉరుకుందకు పోటెత్తిన భక్తులు



స్వామి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు

కౌతాళం, ఆగస్టు 12: ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి సోమవారం భక్తులు పోటెత్తారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు వెండి అలంకరణ చేపట్టి భక్తులకు దర్శనం కల్పించారు. ఆదివారం నుంచే భక్తులు తరలి రావడంతో రద్దీని దృష్టిలో ఉంచుకుని 24 గంటల పాటు దర్శనం కల్పించారు. ఉదయం నుంచి స్వామి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య అంతకంతకు పెరిగిపోవడంతో ఆలయంలోని క్యూలైన్లు నిండిపోయి గంటల తరబడి దర్శనానికి సమయం పట్టింది. వాహనాల రద్దీతో అన్ని రూట్లలో ట్రాఫిక్ పెరిగిపోయింది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు అవస్థలు పడాల్సి వచ్చింది. ఆలయ జీర్ణోద్ధరణ పనులకు సి. బెళగల్ వాస్తవ్యులు మంగమ్మ, గ్రామ ప్రజలు రూ.52,640 దేవాలయ కార్యాలయంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్‌కు అందజేసినట్లు డిప్యూటీ కమిషనర్, ఈఓ గురుప్రసాద్ తెలిపారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

కలెక్టర్ పి. రంజిత్ బాషా



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా, డీఆర్వో మధుసూదన్‌రావు, డీఎస్పీ బాబు ప్రసాద్

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 12: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'నషా ముక్త్ భారత్ అభియాన్' ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని జిల్లా అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని 'నషా ముక్త్ భారత్ అభియాన్' (ఎన్ఎంబీఏ) కార్యక్రమాన్ని (వీక్షిత్ భారత్ కా మంత్ర భారత్ హో నషే సే స్వతంత్ర' అనే థీమ్‌తో ప్రారంభించినట్లు తెలిపారు. దేశంలో యువశక్తి ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నదని, అలాంటి యువత మత్తుకు బానిస కాకూడదన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలనకు వ్యతిరేకంగా అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు, కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి యువకుడి మృతి

హొళగుంద, ఆగస్టు 12: హొళగుంద మండల పరిధిలోని ముగుమానుగుంది గ్రామానికి చెందిన అంజనప్ప (22) అనే యువకుడు విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం జరిగింది. అంజనప్ప ఉదయం 10 గంటల సమయంలో గొర్రెలకు వేపాకుల మేత వేసేందుకు వెళ్లాడు. గొర్రెల దొడ్డిపై 11 కేవీ విద్యుత్ తీగలు వేలాడుతూ ఉండి వేపకొమ్మలు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం ఆలూరు ప్రభుత్వ అస్పత్రికి తరలించగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య రాజమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటన స్థలాన్ని హొళగుంద విద్యుత్ అధికారి ఓబుళమ్మ పరిశీలించారు.

నవోదయ విద్యాలయంలో స్కిప్పింగ్ పోటీలు

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు12: ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి నవోదయ విద్యాలయంలో స్కిప్పింగ్(తాడు దాటడం)పోటీలను విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నవోదయ పాఠశాల పూర్వ విద్యార్థి, సీఐ మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా ప్రిన్సిపాల్ పద్మావతి, సీఐ మోహన్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ ఈ పోటీలను 12వ తేదీ నుండి 14వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మన్న, వైస్ ప్రిన్సిపాల్ చందీరన్, కె. బసవరాజు, ఎర్రిస్వామి, శ్రీలక్ష్మీ, జగన్నాథ్, శిరీష, శ్రీనివాసరావు, వెంకటేష్, అంజలి, నబి పాల్గొన్నారు.

రాత్రిపూట రెవెన్యూ రికార్డుల తరలింపు



రికార్డులు తీసుకెళ్తున్న ప్రైవేట్ వ్యక్తి

హొళగుంద, ఆగస్టు 12: హొళగుంద తహసీల్దార్ కార్యాలయంలో ఓ ప్రైవేట్ వ్యక్తి రాత్రి 9:30 గంటల సమయంలో రికార్డులను తీసుకెళ్లినట్లు తలారులు సిద్దలింగ, మల్లయ్య సోమవారం తెలిపారు. ఆర్ఐ గదిలోని బీరువాలో ఉన్న రికార్డులను తీసుకువెళ్తుండగా తమను బెదిరించి తహసీల్దార్ చెప్పాడంటూ తీసుకెళ్లినట్లు తెలిపారు. రికార్డులు తరలించే దృశ్యాలను తలారులు వీడియో రికార్డు చేసి తహసీల్దారుకు వాట్సాప్‌లో పంపించామని చెప్పారు. దీంతో ఎస్ఐకి తహసీల్దార్ ఫిర్యాదు చేయడంతో ఆ వ్యక్తి కోసం గాలింపు చేపట్టారు. తహసీల్దార్ ఏఎం ప్రసాద్ రాజును వివరణ కోరగా రికార్డులు తీసుకెళ్లమని తాను ఎవరికీ చెప్పలేదని తెలిపారు.

అటవీ ప్రాంతంలో యువకుడి మృతదేహం

పాణ్యం, ఆగస్టు 12 : ఎస్సార్బీసీ మెయిన్ కెనాల్ సమీపంలోని అటవీ ప్రాంతంలో సోమవారం గుర్తు తెలియని యువకుని మృతదేహాన్ని గుర్తించినట్లు పాణ్యం ఎస్ఐ అశోక్ తెలిపారు. పాణ్యం పోలీసు స్టేషన్‌కు నాలుగు కిలోమీటర్ల దూరంలోని ఎస్సార్బీసీ కెనాల్ సమీపంలోని తాటికాయ ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో సోమవారం ఉదయం గుర్తు తెలియని 30 నుంచి 35 సంవత్సరాలలోపు వయసు గల యువకుని మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. యువకుని గొంతుపై, తలపై గాయాలు ఉన్నట్లు తెలిపారు. మృతుడు కట్ బనియన్, జీన్స్ పాంటు ధరించాడని చెప్పారు. పాణ్యం వీఆర్ఓ విజయ్ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇన్‌చార్జి సీఐ వంశీధర్ దర్యాప్తు చేస్తున్నారన్నారు.

యువకుని మృతిపై పలు అనుమానాలు ?

యువకుని మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గొంతు వద్ద తుపాకీతో కాల్చి చంపినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. దీనికితోడు మృతుని తల పక్కన పోలీసులకు తూటా కూడా దొరికినట్టు తెలుస్తోంది. హంతకులు ఎక్కడో చంపి ఇక్కడ తెచ్చిపడేసినట్టు స్థానికులు చర్చించుకుంటున్నారు. తూటా కాక్‌పై ఉన్నతాధికారులు తీవ్రంగా దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. యువకుని సెల్‌ఫోన్ ఆధారంగా మృతుని పేరు సునీల్ కుమార్‌గా, అనంతపురం జిల్లా వాసిగా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేపడితే మృతి వెనుక గల కారణాలు తెలిసే అవకాశం ఉంది.

ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద భారీ భద్రత

కోసిగి, ఆగస్టు 12: ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద భారీ భద్రత ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ నిత్యానంద రాజు తెలిపారు. సోమవారం ఎస్డీఆర్ఎఫ్ టీమ్‌తో ఆనకట్ట వద్ద భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. తహసీల్దార్ నిత్యానందరాజు వరద ప్రవాహం గమనిస్తూ ఎప్పటికప్పుడు జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తున్నారు. నదిలో నీరు అధికంగా ఉండటంతో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని, రైతులు కూడా నదిలోకి వెళ్లవద్దని, గొర్రెల కాపరులు అటు వైపు వెల్లవద్దని సూచనలు చేశారు. ఈయన వెంట వీఆర్వో బసవరాజు, తలారీలు, గ్రామస్థులు, ఎస్డీఆర్ఎఫ్ టీమ్ సభ్యులు ఉన్నారు.

మఠానికి విరాళంగా మూడు వేల మొక్కలు

మంత్రాలయం, ఆగస్టు 12: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి 8 లక్షల విలువ చేసే మూడు వేల మొక్కలను విరాళంగా దాత అందజేశారు. సోమవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులకు మొక్కలను చూపించారు. నంద్యాల జిల్లా పాణ్యంకు చెందిన దాత బద్రీనాథ్ తన నర్సరీలో పెంచుకుంటున్న పూల మొక్కలు, పండ్ల మొక్కలు, ల్యాండ్ స్కేపింగ్ మొక్కలు, అలంకరణ అందంగా ఉండే మొక్కలను ప్రత్యేక లారీతో మంత్రాలయానికి తీసుకువచ్చారు. బద్రినాథ్ సొంతంగా కూలీలను ఏర్పాటు చేసి నది తీరంలో ఉన్న తులసి వనం, గురునివాస్, గురుసార్వభౌమ సాంస్కృతిక విద్యాపీఠం, పరిమళ విద్యానికేతన్, పద్మనాథ తీర్థ గెస్టు హౌస్, వివిధ అతిథి గృహాల్లో ఉచితంగా మొక్కలు నాటి డిజైన్ చేసే బాధ్యతను తీసుకున్నాడు. దాత బద్రినాథ్‌ను మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి మెమెంటో, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

ముదురుతున్న దేవాలయ స్థల వివాదం



రోడ్డుపైన బైఠాయించిన రుక్మిణీ పాండురంగస్వామి దేవాలయ కమిటీ సభ్యులు

- మాదేంటున్న ఆలయ కమిటీ సభ్యులు, వెల్డింగ్ షాపుల యజమానులు
- మున్సిపాలిటీకి చెందిన స్థలంపై ఎవరి ఆధిపత్యం తగదన్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య
- సమస్య పరిష్కరించాలని కమిషనర్‌కు ఆదేశాలు

నందికొట్కూరు, ఆగస్టు 12: నందికొట్కూరు పట్టణంలో రుక్మిణి పాండురంగస్వామి దేవాలయ స్థల వివాదం రోజురోజుకూ ముదురుతోంది. ఆదివారం కాంపౌండ్ వాల్ నిర్మాణానికి బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి భూమి పూజ చేసేందుకు వెళ్లగా సీపీఎం నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో వివాదం ప్రారంభమైంది. రుక్మిణీ పాండురంగస్వామి దేవాలయానికి 27 సెంట్లు నందికొట్కూరు గ్రామపంచాయతీ తీర్మానంతో తీసుకున్నామని కమిటీ సభ్యులు ఆధారాలను చూపుతున్నారు. గ్రామపంచాయతీ ఇచ్చిన స్థలంపై మున్సిపాలిటీకి ఎలాంటి హక్కు లేదని వారు వాదిస్తున్నారు. అదే క్రమంలో వెల్డింగ్ కార్మికులు కూడా తాము కూడా గత కొంత కాలంగా దుకాణాలు వేసుకొని మున్సిపాలిటీకి పన్ను చెల్లిస్తూ జీవనం సాగిస్తున్నామని వారు చెబుతున్నారు. కాబట్టి తమ స్థలం తమకు కేటాయించాలంటూ వెల్డింగ్ కార్మికులు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యకు సోమవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరుగుతున్న సమయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ నాయకుడు నరసింహులుతో పాటు వెల్డింగ్ కార్మికులు మాట్లాడుతూ దేవాలయ కమిటీ సభ్యులు బంకులను తొలగిస్తూ కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నారని, ఆ పనులను వెంటనే అడ్డుకొని తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీకి చెందిన స్థలంపై దేవాలయ కమిటీ సభ్యులు, వెల్డింగ్ కార్మికుల పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. ఈ స్థల వివాదంపై విచారణ చేసి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఆయన కమిషనర్ సుధాకర్‌రెడ్డిని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ కలెక్టర్ రాజకుమారితో నంద్యాలలో చర్చించారు. కాగా దేవాలయాల భూములను కాపాడుకుంటామని విశ్వహిందూపరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి అన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఐ ఎంఎల్ నాయకుడు నరసింహులు, వెల్డింగ్ కార్మికులు

ఎర్రకోట వేడుకలకు మద్దికెర విద్యార్థి



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం అజరయ్ బాబు

మద్దికెర, ఆగస్టు 12: ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగే పంద్రాగస్టు వేడుకలకు మద్దికెర గ్రామానికి చెందిన విద్యార్థి యు. పవన్ కుమార్ ఎంపికయ్యారు. స్థానిక ఉప్పరవీధిలో నివసించే యు. పవన్ కుమార్ 10వ తరగతి స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో చదువుకుంటున్నాడు. పవన్ కుమార్ ఢిల్లీలో ఎర్రకోట పరేడ్ మైదానంలో జరిగే కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఈ ఏడాది జూన్ 1న గుజరాత్‌లో జరిగిన ప్రేరణ కార్యక్రమంలో ఎంపిక కావడంతో విద్యార్థికి ఈ అవకాశం వచ్చిందని ప్రిన్సిపాల్ అజరయ్‌బాబు, యు. శ్రీనివాసులు అభినందించారు.

గాజులపల్లి రైతు భరోసా కేంద్రంలో చోరీ

మహానంది, ఆగస్టు 12: మహానంది మండలం గాజులపల్లి -1 రైతు భరోసా కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు మండల వ్యవసాయాధికారి బి.నాగేశ్వరరెడ్డి తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆర్‌బీకే తలుపులకు వేసిన తాళాలను పగలకొట్టి కార్యాలయంలోని విలువైన కంప్యూటర్‌ను దొంగలించుకొని వెళ్లినట్లు తెలిపారు. సోమవారం ఉదయం విధులకు హాజరైన సిబ్బంది రైతు భరోసా కేంద్రం తలుపులు పెకిలించి ఉండటం గమనించి విషయాన్ని తన దృష్టికి తెచ్చారని చెప్పారు. చోరీకి గురైన కంప్యూటర్, పరికరాల విలువ రూ.80 వేలు ఉంటుందని తెలిపారు. మహానంది పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏవో చెప్పారు.

చెట్టుకు ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కొత్తపల్లి, ఆగస్టు 12: కొత్తపల్లికి చెందిన గూడెం స్వాములు (39) అనే వ్యక్తి వేప చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శేషారామ్‌సింగ్ వివరాల మేరకు.. కొత్తపల్లి ఎస్సీ కాలనీకి చెందిన గూడెం స్వాములుకు ఆత్మకూరు పట్టణానికి చెందిన విజయమ్మతో సుమారు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి తరచూ మద్యం సేవిస్తుండేవాడు. ఇటీవల మతిస్థిమితం లేకుండా తిరుగుతుండేవాడు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం కూడా గూడెం స్వాములు మద్యం సేవించి అదే కాలనీలోని ఓ వేప చెట్టుపైకి ఎక్కి పైభాగాన ఉన్న కొమ్మకు తాడుతో గొంతుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య విజయమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

మహానందిలో అనంతపురం జిల్లా న్యాయాధికారి పూజలు



జడ్జి శోభారాణి కుటుంబ సభ్యులను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

మహానంది, ఆగస్టు 12: మహానంది క్షేత్రంలో సోమవారం అనంతపురం జిల్లా న్యాయాధికారి శోభారాణి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు జరిపారు. వీరికి ఆలయం ముఖ మంటపం వద్ద టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరునికి కుంకుమార్చన, అభిషేకాలను నిర్వహించారు. కల్యాణమంటపంలో వీరిని వేదపండితులు ఆశీర్వదించి, ప్రసాదాలను అందజేశారు.

ఆల్బెండజోల్ టాబ్లెట్స్ మింగించండి

కలెక్టర్ రాజకుమారి



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, సంబంధిత అధికారులు

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 12: ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలలో చదువుతున్న 1-19 సంవత్సరాలలోపు పిల్లలందరితో ఆల్బెండజోల్ టాబ్లెట్స్‌ను నమిలి మింగించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్లో జాతీయ నులిపురుగుల నిర్మూలనపై జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో నులిపురుగుల గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ నులిపురుగుల కారణంగా రక్త హీనతకు గురయ్యే ప్రమాదాన్ని నివారించేందుకు పిల్లలందరితో ఆల్బెండజోల్ టాబ్లెట్స్‌ను మింగించాలని అన్నారు.

- బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బాల కార్మికుల వ్యవస్థను నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులను కలెక్టర్ ఆదేశించారు.

వైసీపీ వాళ్లలా కక్ష రాజకీయాలు చేయొద్దు

సమావేశంలో కన్నీరు కార్చిన మహిళా సర్పంచ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆదోని రూరల్, ఆగస్టు 12 : గత ప్రభుత్వంలా కక్షతో రాజకీయాలు చేయవద్దని దొడ్డనగేరి సర్పంచు పార్వతమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధి ప్రణాళిక మూడు రోజుల శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా, సోమవారం స్థానిక ఎంపీపీ భవన్‌లో ఎమ్మెల్యే పార్థసారధి అధ్యక్షతన ఆయా గ్రామాల సర్పం చులకు శిక్షణ ఇచ్చారు. వైసీపీలాగా కక్ష రాజకీయాలు చేయొద్దని, పంచాయతీ నిధులన్నీ గతంలో జగన్ దొంగలించాడని, వైసీపీ, సాయిప్రసాద్‌రెడ్డిలా మీరు చేయొద్దని కన్నీరు కారుస్తూ, దొడ్డనగేరి సర్పంచు పార్వతమ్మ ఎమ్మెల్యే పార్థసారధికి సూచించారు. ఎంపీపీ బడాయి దానమ్మ, డీఎల్‌పీఓ నూర్జహాన్, ఎంపీడీవో గీతావాణి, ఈఓపీఆర్‌డీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులపై స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేయాలి

ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల టౌన్, ఆగస్టు 12 : తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకుపోయిన నేపథ్యంలో సాగునీటి ప్రాజెక్టులపై సాంకేతిక నిపుణులతో స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాల సమితి కార్యాలయంలో దశరథరామిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమలోని ప్రాజెక్టులకు ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని, ప్రాజెక్టులను బాగు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. అలగనూరు రిజర్వాయర్ కట్టలకు కోతలు, గోరుకల్లు రిజర్వాయర్ రివిట్‌మెంట్ ఇబ్బందులు, వెలుగోడు రిజర్వాయర్ నుంచి బ్రహ్మసాగర్‌కి నీరు చేర్చే ప్రధానమైన మద్రాసు కాలువ నిర్వహణ లోపాలు, 2009 వరదలతో సుంకేసుల నుంచి కేసీ ప్రధాన కాలువ బలహీనపడటం, సుంకేసుల బ్యారేజి గేట్లు, పోతిరెడ్డిపాడు రిజర్వాయర్ గేట్లు, అన్నమయ్య ప్రాజెక్టు, శ్రీశైలం రిజర్వాయర్ ప్లంజ్ పూల్, హంద్రీ-నీవా ప్రధాన కాలువలు, గాలేరు -నగరి ప్రాజెక్టుతో సహా రాయలసీమ వ్యాప్తంగా వివిధ రిజర్వాయర్లు, బ్రాంచ్, పంట కాలువల రూపురేఖలు కూడా లేకుండాపోవడం, పీఏబీఆర్ నిర్వహణ, అనేక చెరువుల గట్లు బలహీన పడటం, కృంగిపోవడం, గురురాఘవేంద్ర ప్రాజెక్టులోని ఎత్తిపోతల పథకాలు, చెరువులకు నీరు అందించే వాగులు, వంకల, కాలువల వ్యవస్థ క్షీణించడం తదితర అనేక సాగునీటి ప్రాజెక్టుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల తుంగభద్ర ప్రాజెక్టు గేటు కొట్టుకపోయిన నేపథ్యంలో నిపుణులతో స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు

చిప్పగిరి, ఆగస్టు 12: చిప్పగిరి కుందనగుర్తి మధ్య సోమవారం జరిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. కుందనగుర్తి గ్రామానికి చెందని కురువ గాది లింగ, మునిగిరి పెద్దయ్య ద్విచక్ర వాహనంపై చిప్పగిరి రైతు సేవా కేంద్రానికి వెళ్తుండగా గుంతకల్ నుంచి ఆలూరుకు వెళ్తున్న కారు వేగంగా వచ్చి వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. 108 వాహనంలో వీరిని గుంతకల్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నులి పురుగుల నివారణతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 12: అల్బెండజోల్ మాత్రలతో నులి పురుగుల నివారణ జరిగి చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని, దీనికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా వైద్య, అనుబంధ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా నులిపురుగుల నివారణకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం ప్రతి సంవత్సరం రెండుసార్లు (ఫిబ్రవరి 10న, ఆగస్టు 10 తేదీల్లో) నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జాతరలా చేపల వేట





శ్రీశైలం, ఆగస్టు 12: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం తగ్గడంతో అధికారులు సోమవారం గేట్లు మూసివేశారు. దీంతో మత్స్యకారులు ఒక్కసారిగా చేపల వేటకు జలాశయానికి బయలుదేరి వెళ్లారు. పది రోజులుగా భారీ వరద ప్రవాహం వస్తుండడం, జలాశయం పది గేట్లు ఎత్తడంతో చేపల వేటపై నిషేధించారు. సోమవారం జలాశయానికి వరద ప్రవాహం తగ్గడంతో వలలు సిద్ధం చేసుకొని వేటకు మొదలుపెట్టారు. దీంతో నదిలో పడవల సందడిగా మారింది.

ఆవుల యజమానిపై ఎఫ్‌బీవో దాడి



దాడిలో గాయాలపాలైన చంద్రయ్య

కొత్తపల్లి, ఆగస్టు 12: కొత్తపల్లి మండలం ముసలిమడుగు అటవీ ప్రాంతంలో ఆవులు మేపుకుంటున్న జంగాల చంద్రయ్యపై ముసలిమడుగు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బీవో) పాములేటి విచక్షణారహితంగా దాడి చేయడంతో ఆయనకు గాయాలయ్యాయి. బాధితుడు చంద్రయ్య కొత్తపల్లిలో విలేకరులతో తమ గోడు వెలిబుచ్చాడు. సోమవారం ఉదయం చంద్రయ్య తన ఆవుల మందను అటవీ సమీపంలోని గార్లదిన్నె, దోవకుంట పరిసర ప్రాంతాల్లో మేపుకుంటున్నాడు. ఉన్న ఫలంగా ఎఫ్‌బీవో పాములేటి ప్రొటెక్షన్ వాచర్లతో కలిసి ఆవులను అటవీ ప్రాంతంలో ఎలా మేపుతావంటూ కర్రతో విచక్షణారహితంగా కొట్టాడని కన్నీరు మున్నీరయ్యాడు. ఆవులు మేపుకునేందుకు ప్రతి ఏడాది అటవీ అధికారులకు చలానా కూడా చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను విజ్ఞప్తి చేశాడు. ఈ ఘటనపై ఎమ్మెల్యే గిత్తా జయసూర్య స్పందిస్తూ చంద్రయ్యపై దాడి చేసిన ఫారెస్టు సిబ్బందిపై కేసు నమోదు చేయాలని అన్నారు. సోమవారం ఆయన మండలంలోని సింగరాజుపల్లెలో ఓ వివాహ వేడుకలకు హాజరు కాగా బాధితుడు తన గోడు విన్నవించుకున్నాడు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే సదరు అధికారిపై చర్యలు తీసుకుని కేసు నమోదు చేయాలని అక్కడే ఉన్న పోలీసు అధికారులను ఆదేశించారు.



కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 12: ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని నగరంలో ఘనంగా నిర్వహించారు. నగరంలోని సీఆర్ భవన్‌లో వేడుకలు జిల్లా అధ్యక్షుడు సోమన్న అధ్యక్షతన నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జెండాను మాజీ జాతీయ కార్యదర్శి కె.రామాంజనేయులు ఆవిష్కరించారు. అనంతరం మాజీ జిల్లా కార్యదర్శులు మునెప్ప, జగన్నాథం కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

కోడుమూరు: స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పని సర్దుబాటును బహిష్కరిస్తున్నాం

ఓర్వకల్లు, ఆగస్టు 12: ఉపాధ్యాయుల పని సర్దుబాటును బహిష్కరిస్తున్నామని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, ఫ్యాప్టో జిల్లా కో చైర్మన్ ఇస్మాయిల్ అన్నారు. సోమవారం ఎంఆర్సీ భవన్‌లో ఎంఈవో ఓంకార్ యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఇస్మాయిల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా చేపట్టిన పని సర్దుబాటు ప్రక్రి యలో ఉపాధ్యాయుల సూచనలు పాటించకుండా చేపట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు శేషాచలం, సురేష్ కుమార్, గజేంద్ర, ప్రభుదాస్, నిసార్ అహ్మద్ పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీలుగా తీర్చిదిద్దాలి

గూడూరు, ఆగస్టు 12: మండలంలోని గ్రామ పంచాయతీలను ఉత్తమ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో విజయ సింహారెడ్డి అన్నారు. సోమవారం గూడూరులోని వెలుగు కార్యాలయంలో గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ విధులు, బాధ్యతలు, పారిశుధ్యం, తాగునీరుపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుదాం: కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 12: ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని నగర పాలక సంస్థ కమిషనర్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ పిలుపునిచ్చారు. సోమవారం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ చేపట్టిన నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉద్యోగులు, సిబ్బందితో కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు. మేనేజర్ చిన్నరాముడు, సూపరింటెండెంట్లు ప్రసాద్‌గౌడు, మంజూర్ బాషా పాల్గొన్నారు.


అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్

కర్నూలు(హాస్పిటల్): మాదక ద్రవ్యాల రహిత దేశంగా మారుద్దామని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ పిలుపునిచ్చారు. సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీలో విద్యార్థులతో ఆమె ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ హరిచరణ్, సాయిసుధీర్, రేణుకదేవి, ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు ప్రొఫెసర్ డాక్టర్ బ్రహ్మాజీ, ఫార్మాకాలజీ హెచ్ వోడీ రాజేష్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అరుణ, సోమశేఖర్, ప్రవీణ పాల్గొన్నారు.

కర్నూలు(అర్బన్): డ్రగ్స్ మహమ్మారిని సమాజం నుంచి పారదోలాలని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.ఎం. జహనరా పిలుపునిచ్చారు. సోమవారం అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో ఆమె విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ బి.వెంకటన్న, ఎన్ఎస్ఎస్ యూనిట్ పీవో సీహెచ్ పాల్ కృపాకర్, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్లూరు: యువత మాదకద్రవ్యాలకు బానిసలు కావద్దని కల్లూరు ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ రవికిషోర్ పాల్గొన్నారు.

కర్నూలు(ఎడ్యుకేషన్): కేవీఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ జి.లాలెప్ప అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.రేష్మా ఆధ్వర్యంలో విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థినులు పాల్గొన్నారు.

గూడూరు: యువత డ్రగ్స్ మహమ్మారి బారిన పడొద్దని ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం గూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్ర మంలో అధ్యాపకులు కోటేశ్వరి, సాంబశివారెడ్డి, శాంతిప్రియ పాల్గొన్నారు.

రైతులను పరామర్శించిన ఎమ్మెల్యే

కల్లూరు, ఆగస్టు 12: కల్లూరు మండలం పెద్దటేకూరులో గతరాత్రి ముగ్గురు రైతుల గడ్డివాములు దగ్ధమయ్యాయని తెలుసుకున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత సోమవారం బాధితులను పరామర్శించారు. పెద్దటేకూరులో ఎమ్మెల్యే గౌరుచరిత పర్యటించి రైతులు కుర్వ కోటయ్య, బోయ ఎల్లప్ప, బోయ సుధాకర్‌లను పరామర్శించి సంఘటనా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులకు ఆర్థిక సాయం అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు డి.రామాంజనేయులు, నాయకులు ఈవీ రమణ, వాకిటి. మాదేష్, సాయితరుణ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ యాగంటయ్య, సురేష్, జగన్నాథం, దొడ్డిపాడు బాషా, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదవాలి

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదివి తల్లిదండ్రులు, కళాశాల పేరు ప్రతిష్ఠలు నిలపాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. సోమవారం బి.క్యాంప్ ప్రభుత్వ జూనియర్ కళాశా లలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.


బాధిత రైతులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

నగరంలో రెండు ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్

మరో చైన్ స్నాచింగ్‌లో పట్టుబడిన దొంగ

కర్నూలు, ఆగస్టు 12: నగరంలో చైన్ స్నాచర్లు చెలరేగిపోయారు. సోమవారం రెండు ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌లు జరగ్గా.. మరో ప్రాంతంలో జరిగిన చైన్ స్నాచింగ్‌లో పోలీసులు దొంగను చాకచక్యంగా పట్టుకున్నారు. మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గణేష్ నగర్‌లో రామచంద్ర మిషన్ వద్ద రామలక్ష్మమ్మ అనే మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు గొలుసును తెంపుకుని ఉడాయించారు. రామలక్ష్మమ్మ స్థానికంగా ఇళ్లలో పాచి పనులు చేస్తూ జీవిస్తోంది. ఆమె నడుచుకుంటూ వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు అగంతకులు ఆమె గొలుసును తెంపుకుని పరారయ్యారు. అలాగే తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలాజీ నగర్‌లో శ్రీకాంతమ్మ అనే మెడలో నుంచి బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు గొలుసు తెంపుకుని పరారయ్యారు. శ్రీకాంతమ్మ తన ఇంటి నుంచి ఫాల్స్ కొనుగోలు చేసేందుకు దుకాణానికి వెళ్తుండగా.. ఈ ఘటన చోటు చేసుకుంది. అపహరణకు గురైన గొలుసు నాలుగు తులాలు ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే గణేష్‌నగర్‌లోని ఘటనా స్థలానికి పోలీసులు వెళ్లారు. హెడ్ కానిస్టేబుల్ రంగారావు, మరో కానిస్టేబుల్‌తో కలిసి విచారిస్తుండగా ఇదే ప్రాంతంలో ఓ చైన్ స్నాచర్ మరో మహిళలో మెడలో గొలుసును తెంపుకునే ప్రయత్నం చేశాడు. గుర్తించిన రంగారావు అప్రమత్తమై తన బైక్‌తో ఆ చైన్ స్నాచర్ బైక్‌ను ఢీకొట్టించాడు. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న అగంతకుడు కింద పడ్డాడు. దీంతో స్థానికులు అప్రమత్తమై వెంటనే స్నాచర్‌ను పట్టుకున్నాడు. చైన్ స్నాచర్‌ను స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా.. తెర్నేకల్‌కు చెందిన వీరేష్‌గా గుర్తించారు. గతంలో కూడా మాధవీనగర్, అబ్బాస్ నగర్‌లో రెండు చైన్ స్నాచింగ్‌లు తానే చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు సమాచారం.

పోక్సో కేసు నమోదు

కర్నూలు, ఆగస్టు 12: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రాణా ప్రతాప్ అనే వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఎర్రబురుజు ప్రాంతానికి చెందిన ఈ నిందితుడు సమీపంలో ఉన్న ఎనిమిదేళ్ల బాలికను తన ఇంట్లోకి తీసుకెళ్లి లైంగికంగా వేధించాడు. దీంతో బాలిక గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాణ్యత లోపించిన రోడ్డు

» నిరసనకు దిగిన సీపీఎం నాయకులు

» కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కోడుమూరు, ఆగస్టు 12: కోడుమూరు-గూడూరు రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించిందని సీపీఎం నాయకులు సోమవారం రోడ్డుపై నిరసనకు దిగారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణ పనుల కోసం డిసెంబరులో రూ.6.70 కోట్లు నిధులను విడుదల చేసిందన్నారు. గత 20 సంవత్సరాలుగా రోడ్డు పూర్తిగా శిథిలం కావడంతో ఇటు వైపు ప్రయాణించేందుకు ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఇన్నాళ్ళకు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని సంతోషిస్తున్న తరుణంలో నాసిరకంగా రోడ్డు వేసి నిధులను బొక్కేయాలని సదరు కాంట్రాక్టర్ ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. సీపీఎం నాయకులు మాధవ క్రిష్ణయ్య, రామాంజనేయులు, కోటయ్య, గుండప్ప, వెంకటేశ్వర్లు, బాలు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

కర్నూలు(రూరల్), ఆగస్టు 12: అమరావతిలోని వెలగపూడి సచివాల యంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను సోమవారం కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి చాంబర్‌లో పూలబొకె ఇచ్చి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. కోడుమూరు నియోజకవర్గంలో ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను మంత్రికి వివరించారు. అనంతరం సచివాలయంలోనే మంత్రి టీజీ భరత్‌ను కూడా ఆయన చాంబర్‌లో కోడుమూరు ఎమ్మెల్యే కలిశారు. నియోజకవర్గంలో చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటు గురించి దస్తగిరి ఆయనకు వివరించారు. టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువ ర్ధన్‌రెడ్డి ఉన్నారు.


మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 12: విద్యార్థుల సమస్యలను పరిష్కరిం చాలని కోరుతూ సోమవారం పీడీఎస్‌యూ నాయకులు కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, రాజు, అశోక్, వెంకటేష్ పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్ల కొవ్వొత్తుల ర్యాలీ


కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న జూనియర్ డాక్టర్లు

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 12: కలకత్తాలోని ఆర్‌జీకేఏఆర్ మెడి కల్ కాలేజీ సెకండియర్ పీజీ విద్యార్థిని హత్యను నిరసిస్తూ సోమవారం రాత్రి జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ మాధవీ శ్యామల, అసోసియేట్ ప్రొఫెసర్ జే.జయరాం సంఘీభావం ప్రకటించారు. జూడాల సంఘం అధ్యక్షుడు డాక్టర్ అచ్యుత్, వైస్ ప్రెసిడెంటు పవన్ కళ్యాణ్, భరత్, శిరీషలు మాట్లాడారు. కలకత్తాలో మెడికల్ కాలేజీ విద్యార్థిని హత్యను నిరసిస్తూ మంగళవారం నుంచి ఆసుపత్రిలో ఓపీ, ఎలక్టివ్ సేవలు నిలిపివేస్తున్నట్లు జూడాల సంఘం అధ్యక్షుడు డాక్టర్ అచ్యుత్ తెలిపారు.

పారిశుధ్యానికి పెద్దపీట: డీపీవో

కల్లూరు, ఆగస్టు 12: గ్రామ పంచాయతీల్లో పరిశుభ్రత, పారిశుధ్యానికి పెద్దపీట వేయాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు పిలుపునిచ్చారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు 3రోజుల శిక్షణలో భాగంగా కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈఓఆర్డీ రవికిషోర్ ఎంపీపీ బి.శారద, సర్పంచులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారుడికి ఆర్థిక సాయం

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 12: జాతీయ స్థాయిలో రాణిస్తున్న తైక్వాండో క్రీడాకారుడు విశ్వాసరావుకు మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ రూ. 10వేలు ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం మౌర్యఇన్‌లోని తన చాంబరులో కోచ్ వెంకటేశ్వర్లు, క్రీడాకారుడు విశ్వాస్‌రావు కలిసారు.

విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 12: విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ అన్నారు. సుందరయ్య స్ఫూర్తి కేంద్రం అధ్వర్యంలో సోమవారం సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాలలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో విజయం సాధించిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులు అందజేసే ముగింపుసభ కన్వీనర్ జే.రంగస్వామి అధ్వర్యంలో జరిగింది. కరస్పాండెంట్ శౌరిల్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 12: కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ఎయిడ్స్ ప్రచార పోస్టర్లను కలెక్టర్ రంజిత్ బాషా ఆవిష్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎల్.భాస్కర్, డాక్టర్ హేమలత, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం పాల్గొన్నారు.

విశ్రాంత ఆడిట్ అధికారిని తొలగించాలి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 12: నగర పాలక సంస్థ కార్యాలయంలో పని చేస్తున్న విశ్రాంత ఆడిట్ అధికారి జే.హనుమాన్ ప్రసాద్‌ను విధుల నుంచి తొలగించాలని రాయలసీమ మాల మహానాడు అధ్యక్షుడు మాదాసు నాగరాజు కోరారు. ఈ మేరకు ఇటీవల రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణకు ప్రజాసంఘాల తరఫున లేఖ రాశారు. గత ప్రభుత్వంలో హనుమాన్‌ప్రసాద్‌ను మాన్యువల్ అకౌంట్ సెక్షన్ సలహదారుడిగా నియమించిందన్నారు. నాలుగేళ్ల నుంచి పని చేస్తున్న ఇతనికి గౌరవ వేతనం కింద ఇప్పటి వరకు రూ.18 లక్షలు చెల్లిం చిందన్నారు. విశ్రాంత అధికారిని విధుల నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు.

వేలంలో రూ. 2.16 లక్షలు ఆదాయం

కోడుమూరు(రూరల్), ఆగస్టు 12: కోడుమూరు సెబ్ పోలీసులు అక్రమ మద్యం, నాటుసారా కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను సోమవారం వేలం వేశారు. వేలంలో రూ 1,81,300, జీఎస్టీ కింద రూ.35,634 ప్రభుత్వానికి ఆదాయం సమకూరిందని సీఐ రామాంజనేయులు తెలిపారు.

పాఠశాలకు మైక్ సెట్ విరాళం



పాఠశాలకు మైక్ సెట్ అందజేస్తున్న నాగరాజు స్వామి

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 12: పట్టణంలోని అర్ధగిరి బసవన్న గౌడ్ పురపాలక ప్రాథమిక పాఠశాలకు సోమవారం దాత నాగరాజు స్వామి మైక్‌సెట్‌ను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున మాట్లాడుతూ దాత నాగరాజు స్వామి గత మూడేళ్లుగా తమ పాఠశాలకు విద్యార్థులకు అవసరమైన ప్లేట్లు, నోట్ పుస్తకాలు, విద్యా సామగ్రిని అందిస్తున్నారన్నారు. అనంతరం దాతను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మావతమ్మ, వీరచంద్ర యాదవ్, గీత, ప్రమీలమ్మ, శ్రీనివాసులు బీచుపల్లి పాల్గొన్నారు.

ముగిసిన వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు



విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 12: పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యక్తిత-వికాసం నైపుణ్యాలపై విద్యార్థులకు నిర్వహించిన శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. కళాశాల చైర్మన్ విట్టా సతీష్, కరస్పాండెంట్ దైవాధీనం రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమలోని నైపుణ్యాలకు పదును పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. మానసిక వికాసం, ఆత్మస్థైర్యం, మంచి ఆలోచనలతో ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కరస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చంద్రకాంత్ రెడ్డి, డాక్టర్ విజయలక్ష్మి, నరేంద్ర, సుగురప్ప, ప్రశాంత్, యుగంధర్ రెడ్డి, ఇందిరా పాల్గొన్నారు.

చెరువులను నింపాలి

దేవనకొండ, ఆగస్టు 12 : హంద్రీనీవా నీటితో జిల్లాలోని 106 చెరువులను నింపాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు కర్నూలు ఎంపీ బస్తీపాటి నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. దేవనకొండ క్రాస్‌రోడ్డు వద్ద లిబరేషన్ నాయకులు మునిస్వామి మాట్లాడుతూ సరైన వర్షాలు లేకపోవడంతో హంద్రీనీవా ద్వారా చెరువులను నింపి జిల్లాలో సాగు,తాగు నీరు అందేలా చుడాలని ఎంపీ కోరారు.

టీడీపీ నాయకులు సన్మానం : తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకుపోవడంతో పరిశీలనకు వెళ్తున్న ఎంపీ బస్తీపాటి నాగరాజు దేవనకొండ క్రాస్‌రోడ్డులో మండల నాయకులు ఆకుల వీరేష్ సన్మానించారు. హంద్రీనీవా నీటితో పంటలను కాపాడాలని కోరారు. రాజాసాబ్ ,మురళి ,బాలరంగడు ,మజీద్, రామిరెడ్డి, తదితరులు ఉన్నారు.

హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 12: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని పీడీఎస్‌వో డివిజన్ కార్యదర్శి శివ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్ట్స్ కళాశాల మైదానంలో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఉన్న ఎస్సీ బీసీ బాయ్స్, గర్ల్స్ హాస్టల్‌కు సొంత భవనాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అలాగే సంక్షేమ హాస్టళ్లకు రెగ్యులర్ వార్డులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆది, అశోక్, సాయి, ఉదయ్, రమేష్, ఉపేంద్ర, ఉరుకుంద పాల్గొన్నారు.

కూటమి నాయకుల వేధింపులు ఆపాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఆస్పరి, ఆగస్టు 12: స్కీం వర్కర్స్‌పై కూటమి పార్టీ నాయకులు వేధింపులు ఆపాలని సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి, ఏఐటీయూసీ మండల కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం ఆస్పరి ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ శివ శంకర్ నాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్కీం వర్కర్లపై అంగన్‌వాడీ, ఆశ మధ్యాహ్నం భోజన కార్మికులను తొలగించి తమ వాళ్లను పెట్టుకుంటామని స్థానిక నాయకులు బెదిరిస్తూ దౌర్జన్యానికి పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకురాలు రాజమ్మ, చిట్టెమ్మ, ప్రమీల, నాగమణి, సరోజ, విజలయలక్ష్మి, సజీవమ్మ, సువర్ణ, రాణి, వరలక్ష్మి, నాగలక్ష్మి, సరస్వతి, ప్రశాంతి, ఉమామహేశ్వరి, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, హనుమంతు, ఉరుకుందప్ప, సంజయ్, ఈశ్వర్ పాల్గొన్నారు

స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి

నందవరం, ఆగస్టు 12: తహసీల్దారు కార్యాలయంలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ప్రసాద్, రాజు డిమాండ్ చేశారు. సోమవారం వారు తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలో పెండింగ్‌లో ఉన్న భూములను సమగ్ర సర్వే జరిపి అర్హులైన వారి పేర్లను రెవెన్యూ రికార్డులైన ఆర్వోఆర్, అడంగల్, ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా స్పెషల్ డ్రైవ్ చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం తహసీల్దారు శ్రీనివాసులుకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు యేసేపు, రత్నం, బాలరాజు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 12 : ఎమ్మిగనూరు పట్టణంలో హెచ్‌బీఎస్ కాలనీలోని సచివాలయాన్ని మునిసిపల్ కమిషనర్ గంగిరెడ్డి సోమవారం తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బందికి సంబంధించిన హాజరు రిజిస్టర్, ఇతర రికార్డులను పరిశీలించి ప్రజలకు అందించే సర్వీసులను ఎస్ఎల్ ఏ ప్రకారం నిర్ణిత సమయంలో పనులను పూర్తి చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పండ్ల మొక్కల పంపిణీ



మొక్కలను అందజేస్తున్న దృశ్యం

పెద్దకడుబూరు, ఆగస్టు 12: పెద్దకడుబూరులో ఉపాధి హామీ పథకం లో వచ్చిన పండ్ల మొక్కలను టీడీపీ ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి బొగ్గుల నరసన్న రైతులకు సోమవారం అం దజేశారు. ఆయన మాట్లాడుతూ ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులు తమ పంట పొలాల్లో పండ్ల మొక్కలను వేసుకోవాలన్నారు. మండలంలో దాదాపు 70 ఎకరాల్లో ఉద్యాన పంటలుగా కొబ్బరి, జామ, నేరేడు పలు రకాల మొక్కలను రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈసీ ఖాదర్ బాషా, టీపీ రామ్మోహన్‌రెడ్డి, సూర్యప్రకాష్, రాజు పాల్గొన్నారు.

వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



తహసీల్దార్ రవికి వినతి పత్రం ఇస్తున్న వాల్మీకులు

మంత్రాలయం, ఆగస్టు 12: ఏపీలో ఉన్న గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వాల్మీకి, బోయల సామాజికవర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి బోయ సంఘం మంత్రాలయం నియోజకవర్గ కన్వీనర్ పైబావి వీరారెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దార్ రవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నగేష్, అయ్యప్ప, నరసింహులు పాల్గొన్నారు.

మా పొలాలకు సాగునీరు ఇవ్వండి

ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు రైతుల వినతి



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ. శ్యాంబాబు

పత్తికొండ, ఆగస్టు, 12: మా పొలాలకు హంద్రీనీవా ద్వారా సాగునీరు ఇప్పించండి అంటూ పత్తికొండ కొండగేరి ప్రాంత రైతులు సోమవారం ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కోరారు. స్థానిక స్వగృహంలో ఎమ్మెల్యేను కలిసి రైతులు మాట్లాడారు. పత్తికొండ పైతట్టులో ఉన్న చక్రాల వద్ద మినీ రిజర్వాయరు ఏర్పాటు చేస్తే పత్తికొండ ప్రాంతంలో సుమారు ఐదు వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. అందుకు సంబంధించిన నివేదికలను ఎమ్మెల్యేకు అందించారు. పరిశీలించిన ఎమ్మెల్యే రైతులతో మాట్లాడుతూ మినీ రిజర్వాయరు ఏర్పాటుకు రూ.200 కోట్లు అవసరమవుతాయని నివేదికలో పేర్కొన్నారని, ప్రస్తుతం ప్రభుత్వం వద్ద నిధులు లేవన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఖజానా ఖాళీచేసి పోవడంతో ప్రస్తుతం ప్రభుత్వం నడిపేందుకు ముఖ్యమంత్రి కేంద్రం వద్ద తన తెలివితేటలతో నిధులు తెచ్చి ప్రభుత్వాన్ని ముందుకు నడుపుతున్నారన్నారు. నియోజకవర్గ పరిధిలో 68 చెరువులకు నీరుచ్చేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో రూ.250 కోట్లతో పనులు చేపట్టామని, ఈ పథకం ద్వారా మొత్తం 18 వేల ఎకరాలకు సాగు నీరు ప్రయోజనం చేకూరుతుందన్నారు. అయితే ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పెండింగ్ పనులు పూర్తిచేయలేకపోయిందని, పత్తికొండ చెరువుతోపాటు మిగిలిన చెరువులకు నీటిని నింపే కార్యక్రమంపై ముందుకు సాగుతున్నామన్నారు. త్వరలో నీటిపారుదల మంత్రి పత్తికొండలో పర్యటన ఉంటుందని, వివరాలన్నీ ఆయనకు తెలుపుతానన్నారు. రైతులతో పాటు టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, పుండుకూర బ్రహ్మయ్య, బత్తిన లోక్‌నాథ్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి



ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్‌లకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఆదోని, ఆగస్టు 12: పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్ఎస్‌లో ఆదోని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పీ పార్థసారథి పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాలల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏవో వసుంధర, సర్వాయర్ వేణుసూర్య, శ్రీనివాస రాజు, డీఎల్‌డీవో నాగేశ్వరరావు, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, డిప్యూటీ డీఈవో వెంకట రమణ రెడ్డి, ఆర్డీవో నాగేంద్ర, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఇంజనీర్ రవి కుమార్, ఉప తహశీల్దారు పెద్దయ్య, వలిబాషా పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి కోసం పని చేయాలి

గోనెగండ్ల, ఆగస్టు 12: పంచాయతీ అధికారులు, సర్పంచ్ వార్డు సభ్యులు గ్రామాభివృద్ధి కోసం పాటు పడాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఈవోఆర్‌డీ నగేష్ కోరారు. రిఫ్రెషర్ ప్రోగ్రాం కింద గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు సోమవారం మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో సమావేశం భవనంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో తాగునీటి సమస్య, పారిశుధ్య సమస్య, వీధి దీపాల సమస్య రాకుండా చూడాలన్నారు. గ్రామాభివృద్ధి కోసం ఏ పనులు చేయాలి, ఇందుకు నిధులను ఎక్కడి నుంచి తీసుకురావాలి అనే విషయాలను క్షుణంగా పరిశీలించాలని కోరారు. గ్రామ స్వయం అభివృద్ధి కోసం గ్రామ పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సతీష్, తాటికొండ వెంకటేశ్వర్లు, బైలుప్పల వెంకటేశ్వర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

దేవనకొండ: సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాలని ఎంపీడీవో గౌరీదేవి, ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో పారిశుధ్య, చెత్త నుంచి సంపద తయారీ కార్యక్రమంపై మూడు రోజుల శిక్షణలో భాగం గా మొదటి రోజు శిక్షణ నిర్వహించారు. గ్రామాల్లో సర్పంచులది కీలక పాత్రన్నారు. సంపద సృష్టించేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలని శిక్షణ నిర్వాహకులు నాగార్జున తెలిపారు.

తుగ్గలి: ప్రతి గ్రామంలో క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు ఇన్‌చార్జి ఈవోఆర్‌డీ గోపాల్ అన్నారు. సోమవారం తుగ్గలి ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి గ్రామంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టి వాటర్ ట్యాంకులు శుభ్రం చేయాలన్నారు. అంతేగాకుండా బ్లీచింగ్ పౌడర్, వేస్టాయిల్ చల్లించాలన్నారు.

నందవరం: గ్రామాల్లో సర్పంచులు, కార్యదర్శులు ప్రజల ప్రతి సమస్యపై వెంటనే స్పందించాలని ఎంపీడీవో దశరథరామయ్య తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు, పంచాయతీ కార్యాదర్శులకు మొదటి రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఈశ్వరయ్య, పంచాయతీ సర్పంచులు అక్కమాంబ బండేగురుస్వామి, విరుపాక్షిరెడ్డి, శివన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర నది



నందవరం, ఆగస్టు 12: తుంగభద్ర డ్యాం గేటు దగ్గర చైన్ లింక్ తెగిపోవడంతో తుంగభద్ర నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. మండలంలో తుంగతీర గ్రామాలైన నదికైరవాడి, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, జోహరాపురం, నాగలదిన్నె, గురుజాల, రాయచోటి గ్రామాల రైతులు మో టర్లు, పైపులను తొలగించుకుంటున్నారు. నదితీరా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో దశరథరామ య్య, ఈవోపీఆర్డీ ఈశ్వరయ్య, ఆర్ఐ జర్మీయా గ్రామాల్లో పర్యటించారు.

రహదారి నిర్మించాలి



శ్యాం బాబును కలిసిన టీడీపీ నాయకులు

చిప్పగిరి, ఆగస్టు 12: మద్దికెర-చింతకుంట రహదారిని నిర్మించాలని టీడీపీ నాయకులు మీనాక్షి నాయుడు, పురుషోత్తం చౌదరి, మద్దికెర ఎంపీపీ ధనుంజయలు అన్నారు. ఆదివారం చిప్పగిరి మండలంలోని బిల్లేకల్ గ్రామంలోని భీమలింగేశ్వర స్వామి దేవాలయ దర్శనానికి వచ్చిన ఎమ్మెల్యే శ్యాంబాబును కలిసి వినతి పత్రం అందించారు. చింతకుంట నుంచి మద్దికెర వరకు తారు రోడ్డు నిర్మిస్తే చిప్పగిరి, మద్దికెర, పత్తికొండ మండలాల ప్రజల రాకపోకలకు అనువుగా ఉంటుందని తెలిపారు. దశాబ్దాల నాటి రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం బెల్డోన వేద పండితులు రామనాథ శాస్త్రిని శ్యాంబాబు కలిశారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాసులు, చిప్పగిరి ఎంపీటీసీ సభ్యురాలు వెల్లంకి రజిని, నాగరాజు, కిష్టప్ప, తిమ్మాపురం శేఖర్, హరి, బెల్డోన వెంకటేశులు, భీమ లింగప్ప, వెంకటేశ్వర చౌదరి పాల్గొన్నారు.

వేదవతి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు కృషి చేస్తా



ఎంపీ నాగరాజును సన్మానిస్తున్న ఆలూరు, మంత్రాలయం టీడీపీ నేతలు వీరభద్ర గౌడ్, రాఘవేంద్రరెడ్డి

ఆలూరు, ఆగస్టు 12: వెనుకబడిన ఆలూరు నియోజకవర్గానికి తాగు, సాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలంటే వేదవతి ప్రాజెక్టు అవసరం ఎంతో ఉందని కేంద్రం నుంచి నిధులు మంజూరు చేసి పూర్తయ్యే విధంగా కృషి చేస్తానని కర్నూలు ఎంపీ పంచలింగాల నాగరాజు అన్నారు. సోమవారం హోస్పెట్‌లో టీడీ డ్యాంను పరిశీలించేందుకు వెళ్తూ ఆలూరు టీడీపీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మంత్రాలయం టీడీపీ నాయకులు రాఘవేంద్ర రెడ్డి, బీజేపీ నాయకులు బసవరాజు, టీడీపీ నాయకులు దేవేంద్ర, రమేష్, కురువ హనుమప్ప, రాము యాదవ్, కొమ్ము రాజు పాల్గొన్నారు.

మక్కాకు తొమ్మిది మంది ముస్లింలు



ముస్లింలకు వీడ్కోలు పలుకుతున్న దృశ్యం

పత్తికొండ టౌన్, ఆగస్టు 12: పత్తికొండ పట్టణం నుంచి సోమవారం 9 మంది ముస్లింలు పవిత్రమైన మక్కాకు సోమవారం బయలుదేరి వెళ్లారు. మక్కాకు వెళ్తున్న ముస్లింలను వారి కుటుంబ సభ్యులు, ముస్లిం మత పెద్దలు క్షేమంగా వెళ్లి మక్కా యాత్రను ముగించుకుని తిరిగి సంతోషంగా చేరుకోవాలని అల్లాహ్‌ను ప్రార్థించారు. ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ బాషా మక్కాకు వెళ్తున్న ముస్లింలను శంషాబాద్ ఎయిర్‌పోర్టులో శాలువ, పూలమాలతో సన్మానించి ఘన వీడ్కోలు పలికారు.

పంట నమోదు తప్పనిసరి

దేవనకొండ, ఆగస్టు 12 : ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన పంటలకు రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని ఏడీఏ మోహన్ విజయ్, ఏవో సురేష్‌బాబు తెలిపారు. సోమవారం మండలంలోని కరివేముల గ్రామంలో వరి, పత్తి పంట పొలాలో పర్యటించారు. గూలాబీ రంగు పురుగు బారినపడకుండా తగ్గిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరి పంటలో ఖాళీబాటలు తీయడంతో చీడపీడల బారి నుంచి పంటను కాపాడవచ్చన్నారు. ఏఈవో రంగన్న, జయరాం, తదితరులు ఉన్నారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

తుగ్గలి, ఆగస్టు 12: రైతుల సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. సోమవారం తుగ్గలిలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని, 16న లింగనాయనదొడ్డి, 19న బొందిమాడుగుల, 22న ముక్కెళ్ల, 24న పెండేకల్, 26న ఎద్దులదొడ్డి, 28న కడమకుంట్ల, 30న పగిడిరాయి, సెప్టెంబరు 2న చెన్నంపల్లి, 4న జొన్నగిరి, 6న జి.ఎర్రగుడి, 9న రాతన, 12న తుగ్గలి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని, రైతుల సమస్యలను గ్రామంలోనే పరిష్కరిస్తామని తెలిపారు.

టీబీ డ్యాంను పరిశీలించిన టీడీపీ నాయకులు



మాట్లాడుతున్న మంత్రాలయం టీడీపీ నాయకుడు ఎన్.రాఘవేంద్రరెడ్డి

కోసిగి, ఆగస్టు 12: వరద తాకిడికి కర్ణాటకలో తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకుపోవడంతో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుతో పాటు మంత్రాలయం టీడీపీ నాయకులు ఎన్.రాఘవేంద్రరెడ్డి, కర్నూలు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, మాజీ డీసీసీ ప్రెసిడెంటు పల్లెపాడు రామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ తోవి రామకృష్ణలు సోమవారం తుంగభద్ర డ్యాంను పరిశీలించినట్లు తెలిపారు. ఎల్లెల్సీ అధికారులతో పాటు కర్ణాటక మంత్రులు, ఎమ్మెల్యేలతో గేటు మరమ్మతుల గురించి అడిగి తెలుసుకున్నారు. రెండు, మూడు రోజుల్లోగా పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసి గేటును ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారని వారు తెలిపారు.

తాగు నీటి సరఫరాపై దృష్టి

ఆదోని టౌన్, ఆగస్టు 12: పట్టణంలో తాగునీటి సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మునిసిపల్ ఇంజనీర్ ఇంతియాజ్ అలీ అన్నారు. ఒంగోలు కార్పొరేషన్ నుంచి ఆదోని మున్సిపాలిటీకు వచ్చారు. ఆయన సోమవారం మాట్లాడుతూ వచ్చే వేసవి కాలంలో తాగునీటి ఏద్దడి రాకుండా బసాపురం చెరువును ఎల్ఎల్సీ నీటితో నింపుకోవడం కోసం ఆరు మోటార్లను ఏర్పాటు చేశామని అన్నారు. బసాపురం చెరువు తరవాత రాంజల చెరువును కూడా నీటితో నింపుకోడానికి చర్యలు తీసుకొంటామని తెలిపారు.

నిందితుల అరెస్టు

ఆస్పరి, ఆగస్టు 12: మండలంలోని బిలేకల్ కూరగాయల మార్కెట్‌లో చోటు చేసుకున్న ఘర్షణ సంఘటనలో 25 మంది నిందితులను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ మస్తాన్ వలి తెలిపారు. వీరేష్, వీరేంద్ర, రామాంజనేయులు, నాగరాజు, మురళి, శేఖర్, నరేష్, మాస్ వీరేష్‌తో పాటు మరో 17 మందిని రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు.

గోనెగండ్ల సర్కిల్ పేరు మార్చడం లేదు

ఎమ్మిగనూరు , ఆగస్టు12: గోనెగండ్ల సర్కిల్(నాగిరెడ్డి పెట్రోల్‌బంకు) పేరును మార్చడం లేదని టీడీపీ మైనార్టీసెల్ అధ్యక్ష, కార్యదర్శులు ఉసేన్ సాబ్, తురేగల్ నజీర్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కొంతమంది వైసీపీ నాయకులు కర్నూలు బైపురోడ్డులోని గోనెగండ్ల సర్కిల్ హెచ్‌కెజిఎన్ (హజరత్‌ఖాజాగరీబ్‌నవాజ్) పేరు మారుస్తున్నట్లు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు షాబీర్, అబ్దుల్ సలాం, ఇసాక్, ముల్లాఖలీముల్లా, జహంగీర్, సలీం, అల్తాఫ్, మున్నా, ఫరీద్, మోసిన్, అబ్దుల్లా, సీఎండీ అల్తాఫ్‌లు పాల్గొన్నారు.

ఏఈవోపై ఏడీఏ విచారణ

ఎమ్మిగనూరు, ఆగస్టు 12: మంత్రాలయం మండలంలో ఏఈవోగా విధులు నిర్వహిస్తున్న నరసింహులుపై ఆ మండలానికి చెందిన కొంతమంది వీపీఏలు, ఎంపీఈవోలు జేడీఏకి ఫిర్యాదు చేశారు. ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ సోమవారం ఏడీఏ కార్యాలయంలో ఫిర్యాదు పంపిన వీపీఏలు, నలుగురు ఎంపీఈవోలను విచారించారు. విచారణ నివేదికను జేడీఏకు పంపుతున్నట్లు తెలిపారు.

బీజేపీలో చేరిన వైసీపీ నాయకులు



బీజేపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

ఆదోని టౌన్, ఆగస్టు 12: వైసీపీకి చెందిన నాయకులు సోమవారం బీజేపీలో చేరారు. పెద్దహరివాణం గ్రామం రంగనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో 50 కుటుంబాలు, దిబ్బనకల్లు గ్రామం నుంచి బెస్త నాగరాజ్ ఆధ్వర్యంలో 25 కుటంబాలు, పెద్దపెండెకల్లు గ్రామం నుంచి కాకా సింగ్ ఆధ్వర్యంలో 30 కుటుంబాలు బీజేపీలో చేరారు. ఎమ్మెల్యే పార్థసారథి వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర కుమార్, అసెంబ్లీ కో కన్వీనర్ నాగరాజ్ గౌడ్, మండల అధ్యక్షుడు వేణుగోపాల్, పట్టణ అధ్యక్షుడు జిందే సాయికుమార్, శ్రీనివాస ఆచారి, మాజీ ఎంపీపీ పంపాపతి, మధుసూదన్, శర్మ పాల్గొన్నారు.

వీధి కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలి

మద్దికెర, ఆగస్టు 12: వీధి కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలని ఎంపీడీవో నరసింహమూర్తి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచుల శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. వారు మాట్లాడుతూ సర్పంచులు, గ్రామ కార్యదర్శులు గ్రామాల్లో ఉంటూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. వీధి కుక్కలను చంపకుండా వ్యాక్సిన్ వేయించాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచులు సుహాసిని, విజయుడు, రాజగోపాల్ రెడ్డి, బొమ్మనపల్లి ఆంజనేయులు, నంది కల్పన, కార్యదర్శులుసుధాకర్, బసినేపల్లి పరమేశ్వరప్ప, హరికృష్ణ తదితరులు ఉన్నారు.

ఆయకట్టు పనులు పూర్తి చేయాలి

దేవనకొండ, ఆగస్టు 12 : హంద్రీనీవా ఆయకట్టు స్థిరీకరణ పనులు పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో హంద్రీనీవాను పూర్తిగా విస్మరించిందన్నారు. కూటమి ప్రభుత్వం ఐదేళ్లుగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. మద్దిలేటిశెట్టి, నర్సారావ్ పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలి

మద్దికెర, ఆగస్టు 12: మద్దికెరలోని ముస్లిం శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలని జామీయా మసీదు ముస్లిం కమ్యూనిటీ అధ్యక్షుడు ఆకుల ఖాజావలి, ఖలీల్ కోరారు. సోమవారం తహసీల్దార్ హుశేన్‌సాబ్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ శ్మశానవాటికకు ప్రహరీగోడ లేకపోవడంతో చాలా మంది మలమూత్ర విసర్జనలు చేస్తున్నారని, పశువులు శ్మశానంలోకి వస్తున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి ప్రహరీకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు వాడండి



కూరగాయలు అమ్ముతున్న దృశ్యం

మద్దికెర, ఆగస్టు 12: ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసి పండించిన ఉత్పత్తులనే వాడడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ప్రకృతి వ్యవసాయ మండల యూనిట్ ఇన్‌చార్జి మల్లికార్జున, భీమరాజు అన్నారు. సోమవారం వ్యవసాయ శాఖ రైతు సాధికారిక సంస్థ, ప్రజల భాగస్వాముల ప్రకృతి వ్యవసాయంపై పండించిన పంటలను ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ మండలంలో మొత్తం 700 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రసాద్, పక్కీరప్ప, సలీం, ఉమాదేవి ఉన్నారు.

రాఘవేంద్ర కాలనీలో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 12: పట్టణంలోని 32వ వార్డు రాఘవేంద్ర కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను పరిష్కరించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న డిమాండ్ చేశారు. సోమవారం వార్డు సీపీఐ శాఖా కార్యదర్శి ఈరమ్మ అధ్యక్షతన కాలనీ ప్రజలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ కాలనీ ఏర్పాటై 30ఏళ్ల అయిన కనీసం తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేవన్నారు. వెంటనే ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి సమీఉల్లా, కాలనీలోని మహిళలు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

సివిల్ సమస్యలను పరిష్కరించాలి

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 12: ఎమ్మిగనూరు మండలంలో నెలకొన్న సివిల్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షురాలు కదిరికోట బతకమ్మ, తాలుకా ప్రధాన కార్యదర్శి సుమాల చార్లెస్‌లు కోరారు. సోమవారం తహసీల్దార్ శేషఫణిని కలిసి సమస్యలను విన్నవించారు. వారు మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో రైతులకు సంబంధించిన సివిల్ సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. రీ సర్వే పేరుతో ఒకరి భూమి మరొకరిపై చూపారని, భూమి ఎక్కువగా ఉన్న వారికి తక్కువగాను, తక్కువ భూమి ఉన్న వారికి ఎక్కువగాను చూపడం జరిగిందన్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ శేషఫణిని శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ బాధ్యులు ప్రసన్నకుమార్, మంత్రాలయం నాయకులు దేవపుత్ర, మునెప్ప, యేసురాజు, రంగస్వామి, రాజు లు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

గోనెగండ్ల, ఆగస్టు 12: ప్రభుత్వ మెను ప్రకారం పాఠశాలలో విద్యార్థులకు వంట ఏజెన్సీలు భోజనం ఏర్పాటు చేయాలని మోడల్‌స్కూల్ విద్యాకమిటీ చైర్మన్ గౌస్‌మోహిద్దీన్ కోరారు. సోమవారం మోడల్‌స్కూల్‌లోని మధ్యాహ్నన భోజనం ను ఆయన పరిశీలించారు. భోజనాన్ని నాణ్యతతో కూడిన విధాంగా ఏర్పాటు చేయాలని వంట ఏజెన్సీలకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అక్బర్, గాజులదిన్నె చంద్ర, బడేసా, జయన్న, జనసేన నాయకులు గానుగబాషా, లోకేష్, పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలి



ఎస్ఎస్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు

గోనెగండ్ల, ఆగస్టు 12: గ్రామాలలో ఆయా పంచాయతీ అధికారులు తాగు నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు అన్నారు. సోమవారం గోనెగండ్లలోని ఎస్ఎస్ ట్యాంక్‌ను ఆయన పరిశీలించారు. ఎల్లెల్సీ నుంచి ట్యాంకుకు నీటిని ఏలా పంపింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం ట్యాంక్‌లో ఎంత నీరు ఉంది గ్రామానికి ఎలా నీటిని సరఫరా చేస్తున్నారని పంచాయతీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సాంబయ్య, ఏఈ శ్రీనివాసరెడ్డి, మేజర్ సర్పంచ్ హైమావతి, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు అక్బర్, బాబునాయుడు, మదీనా, పాల్గొన్నారు.

దేవాలయ భూములను కాపాడాలి

ఆదోని, ఆగస్టు 12: ఆదోని డివిజన్‌లో దేవాలయ భూములను కాపాడాలని బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ నాగరాజు గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మనగుడి సంస్థ ద్వారా ఆదోని మండలంలో సమాచార హక్కు ద్వారా స్వీకరించిన వివరాలలో సర్వే నెంబరు పాత సర్వే నెంబర్‌లతో మ్యాచ్ అవడం లేదని, రికార్డుల మధ్య ఎకరాల వ్యత్యాసం ఉందని, హక్కుదారుల పేర్లు మారిపోయాయని ఆరోపించారు. అన్యాక్రాంతమైన దేవాలయ భూములు తిరిగి ఆయా దేవాలయాలకు చెందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.